పాపులర్ రచనలు చేయటం ఎలా?

యండమూరి వీరేంద్రనాథ్

(క్రిందటిసంచిక నుంచి తరువాయి)

<u>సస్పెన్స్</u>

పాపులర్ రచనకి సస్పెన్స్ చాలావరకూ ముఖ్యం. తరువాత ఏం జరుగుతుంది- అన్న ఉత్సుకతే పాఠకుల్ని చివరివరకూ చదివేలా చేస్తుంది. అయితే ప్రతీ నవలా సస్పెన్స్ పునాదిగానే ఉండనవసరం లేదు. సస్పెన్స్ అంటే ఒక హత్య జరగటం, ఆ హత్య ఎవరు చేసారు అనేది తెలుసుకోవటం మాత్రమే కాదు.

‘ అంతర్ముఖం‘ లాంటి నవలలో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టులాడుతున్న మనిషి చివరికేమవుతాడు అన్నది కూడా సస్పెన్స్‌గానే పరిగణించవచ్చు.

ఈ సస్పెన్స్ అనేది రెండు రకాలుగా ఉంటుంది.

‘తులసీదళం‘, ‘వెన్నెల్లో ఆడపిల్లలాంటి‘ నవలల్లో మొదటి చాప్టర్‌లో ఒక సస్పెన్స్ సృష్టించబడింది. పాప బ్రతుకుతుందా, చచ్చిపోతుందా – అనేది తులసీదళంలో మొదటి ఛాప్టర్‌లోనే ముడివేయబడింది. అలాగే వెన్నెల్లో ఆడపిల్లలో ఫోన్ చేసే అమ్మాయి ఎవరు అనేది సస్పెన్స్. ఈ రకమైన సస్పెన్స్ ద్వారా వారపత్రికల సర్క్యులేషన్ బాగా పెంచవచ్చు.

రెండో రకం నవలల్లో ఏ వారానికి ఆ వారం సస్పెన్స్ సృష్టింపబడుతుంది. ఉదాహరణకి మొదటివారంలో హీరో హీరోయిన్లు పరిచయమవుతారు. హీరోయిన్, హీరోతో మాట్లాడి వెళ్ళిపోగానే చెట్టు చాటునుంచి ఒక వ్యక్తి బయటికి వస్తాడు. అక్కడ సశేషం పెడితే ఆ వచ్చిన వ్యక్తి ఎవరా అన్నది రెండోవారం కోసం పాఠకుల్ని ఎదురు చూసేలా చేస్తుంది. ఆ వ్యక్తి బిచ్చగాడయి ఉండవచ్చు. లేదా హీరోయిన్ని చంపుదామనుకున్న విలన్ అయివుండవచ్చు. ఏది ఏమైనా ఒక వారం రోజుల పాటు సస్పెన్స్ పోషించబడింది. ఈ విధంగా ఏ వారానికావారం సస్పెన్స్ పోషించుకుంటూ, చెప్పదలుచుకున్న మామూలు విషయాన్ని కూడా రసభరితంగా చెప్పవచ్చు. అయితే ఈ రకం రచన పాఠకులకి మొత్తం నవల ఒకే రచనగా చదివినప్పుడు తీవ్రమైన అసంతృప్తిని కలుగజేస్తుంది.

‘ప్రార్థన‘, ‘డైరీ ఆఫ్ మిసెస్ శారద‘, ‘రాక్షసుడు‘ లాంటి నవలల్లో మొదటినుంచి చివరివరకూ చదివించే ఏకైక సస్పెన్సు పాయింట్ ఏమీ లేదు. అందువల్ల ఆ నవలల్లో ఈ రకమైన వారం వారం టెక్నిక్ ఉపయోగించబడింది. అందుకే తులసీదళం, వెన్నెల్లో ఆడపిల్ల లాంటి నవలల సక్సెస్‌తో పోల్చుకున్నప్పుడు ఇవి అంత విజయవంతం కాలేదు.

వర్ధమాన రచయితలు పాపులర్ రచన చేయదలుచుకున్నప్పుడు కథ సినాప్సిస్ వ్రాసుకునేటప్పుడే మొదట్లో ఒక మెలిక వేసి ఆ మెలిక చివరివరకు ఎలా కొనసాగించాలి, చివరలో ఎలా విప్పాలి అన్న విధంలోనే ఆలోచిస్తే మంచిది.

<u>ఫ్లో</u>

పాఠకుడు ఒక రచన చదువుతున్నప్పుడు దాంతోపాటు అతను పయనించాలి.. మధ్య మధ్యలో ‘నేనొక నవల చదువుతున్నాను.‘ అన్న అభిప్రాయం పాఠకుడికి కలగకూడదు. అత్యంత ముఖ్యమైన విషయమిది.

దీనిని ప్రతిభావంతంగా చిత్రీకరించాలంటే రచయిత నాలుగు ముఖ్యమైన విషయాలు గుర్తుంచుకోవాలి.

1. ఒక పాత్రతో కథ ప్రారంభించినప్పుడు ఆ అధ్యాయం అంతా (లేక ఆ సంఘటనంతా) ఆ పాత్ర పరంగానే చెప్పటం మంచిది.

"అతను కుర్చీలో కూర్చుని వ్రాసుకుంటున్నాడు. భార్య లోపలికి వచ్చి కాఫీ అందించి వెళ్ళింది. అతడు వెనక నుంచి భార్యని చూసి, వయసు పెరిగినా అందం తగ్గలేదు - అనుకున్నాడు.

ఆమె వెళ్ళిపోయాక తిరిగి అతడు వ్రాసుకోవటంలో నిమగ్నమయ్యాడు. ఈ లోపులో ఫోన్ మ్రోగింది. అతడు చిరాకు పడ్డాడు. ఇంతలో భార్య లోపలికి వచ్చి "మీకోసం ఎవరో బయట ఎదురు చూస్తున్నారు" అని చెప్పింది.

"ఫోన్‌లో మాట్లాడుతున్నాను. కనబడ్డంలా?" అన్నాడతను విసుగ్గా. భార్య అతనివైపు అదోలా చూసి వెళ్ళిపోయింది."

పై సంఘటనలో సంఘటనంతా మొత్తం అతని పరంగానే చెప్పటం జరిగింది. దీన్నే మరో విధంగా కూడా చిత్రీకరించవచ్చు.

"అతడు వ్రాసుకుంటూ ఉండగా భార్య లోపలికి వచ్చింది. కాఫీ కప్పు బల్ల మీద పెట్టి వెనుతిరిగి వెళ్ళిపోయింది. వెనకనుంచి ఆమెను చూస్తూ 'వయసు పెరిగినా అందం తగ్గలేదు' అనుకున్నాడు. అదే సమయానికి ఆమె 'ఎంతో ఏకాగ్రతతో వ్రాసుకుంటున్నా ఈయనకి మాత్రం టైముకి కాఫీ కావాలి' అనుకుంది. ఈ లోపులో ఫోన్ మ్రోగింది. బయటినుంచి ఎవరో పిలిచారు. ఆ విషయం భర్తకి చెప్పింది. "ఫోన్‌లో మాట్లాడుతున్నాను. కనపడడం లేదూ?" అన్నాడు భర్త. 'నాకెందుకు కనపడదు... కానీ బయటెవరో పిలుస్తున్నారుగా?' అనుకుంది మనసులో."

పై ఉదాహరణలో రచయత రెండు పాత్రల్లోకి ప్రవేశించి వారేమనుకుంటున్నారో పాఠకులకి చెప్పడానికి ప్రయత్నం చేశాడు. అందువల్లే రెండవ ఉదాహరణలో రచయిత ఫెయిలయ్యాడు.

2. సాధారణంగా హీరోపరంగానో, హీరోయిన్ పరంగానో కథ చెప్పడం ఎప్పుడూ మంచి పద్ధతి! బాగా పాపులర్ అయిన నవలలు గమనించండి. ఆ నవలల్లో ఎప్పూడూ ఇదే టెక్నిక్ ఉపయోగిస్తారు. అధ్యాయం హీరోతో ప్రారంభమయితే, అతడితోటే నడుస్తుంది. హీరోయిన్‌తో అయితే ఆమెతోనే నడుస్తుంది. విలన్ డామినేషన్ ఉన్న అధ్యాయం అయితే, విలన్‌తోనే ప్రారంభమవుతుంది.

3. చిన్న చిన్న పాత్రలు మనసులో ఏమనుకుంటున్నాయో వ్రాయటం అనవసరం.

4. రెండు పాత్రలు ఒక గదిలో సంభాషించాక, ఒక పాత్ర బయటికి వెళ్ళిపోతే ఆ పాత్రతోనే రచయిత బయటికి వెళ్ళి కథని కొనసాగించదలచుకున్నప్పుడు గదిలో ఉన్న పాత్ర గురించి ఎక్కువగా వ్రాయటం అనవసరం. అలా వ్రాయటం మొదలుపెడితే పాఠకుడు రెండు పాత్రలతో పాటు పయనించలేక అయోమయంలో పడతాడు.

<u>స్థితి, మనస్తత్వం</u>

శిల్పంలో 'ఫ్లో' యొక్క విశిష్ట స్థానం గురించి మనం చర్చిస్తున్నాం. ఫ్లోలో 'పాత్రల యొక్క భౌతికమైన స్థితి' 'మానసికమైన స్థితి' చాలా ముఖ్యమైన పాత్రలు వహిస్తాయి.

అతడు కుర్చీలోంచి లేచి "ప్లీజ్, నువ్వు బయటికి వెళ్ళు" అని అరుస్తూ, బల్లమీదున్న పేపర్ వెయిట్ తీసి బలంగా కొట్టాడు.

ఇదేవాక్యాన్ని ఈ విధంగా చదవండి.

"ప్లీజ్. నువ్వు బయటికి వెళ్ళు" అని అరుస్తూ, అతడు కుర్చీ లోంచి లేచి బల్లమీద పేపర్ వెయిట్‌ని తీసి బలంగా కొట్టాడు.

దీన్ని ఇంకోలా చదండి.

అతడు కుర్చీలోంచి విసురుగా లేచి, బల్లమీదినుంచి పేపర్ వెయిట్‌ని తీసి బలంగా విసిరి కొడుతూ "ప్లీజ్. నువ్వు బయటికి వెళ్ళు" అని ఆవేశంగా అరిచాడు.

ఈ మూడింటిలోనూ మూడవదే ఉత్తమమైన పద్ధతి. ముందతను లేచాడు. బల్లమీద పేపర్ వెయిట్ తీసుకుని బలంగా కొట్టాడు. ఇది చదువుతున్నప్పుడు పాఠకుడు రచయితతోపాటు పాత్రయొక్క ఆవేశానికి లోనై, అతడు అరచిన 'ప్లీజ్, బయటికి వెళ్ళు' అన్న అరుపు యొక్క ఉద్వేగాన్ని గమనిస్తాడు.

'బయటికి వెళ్ళు' అన్న పదాన్ని ముందు వ్రాసి, ఆ తర్వాత ఆ పాత్ర యొక్క స్థితి వ్రాస్తే అది అంత ఉద్విగ్నంగా ఉండదు.

ఇది కేవలం చిన్న ఉదాహరణగా మాత్రమే ఇవ్వబడింది. దీన్ని శిల్పంలో ముఖ్యమైన భాగంగా గుర్తించాలి.

ఒక పాత్రయొక్క స్థితి, మానసిక సంచలనం ముందు వ్రాసి, ఆ తరువాత ఆ పాత్ర యొక్క చర్యని వ్రాయటం ఎప్పుడూ మంచి పద్ధతి.

ఈ క్రింది ఉదాహరణని గమనించండి.

"ఐ లవ్ యూ సునీతా!" అన్నాడతను. ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. సుతారంగా పెదవుల దగ్గర ఆన్చుకుని ముద్దు పెట్టుకుంటుండగా కంటినుంచి ఒక నీటి చుక్క ఆమె చేతిమీద పడింది. ప్రేమకి నిర్వచనం లేదు. దురదృష్టవశాత్తు 'ఐ లవ్ యూ' అనే మూడు మాటలు తప్ప ఇంకేది లేదు.

ఇవే వాక్యాల్ని ఈ విధంగా చదవండి.

అతడామె చేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు. కంటినుంచి నీటిచుక్క ఆమె చేతి మీద పడుతుండగా ఆర్ద్రంగా "ఐ లవ్‌యూ సునీతా!" అంటూ ఆ చేతిని ముద్దు పెట్టుకున్నాడు.

ప్రేమని నిర్వచించడానికి ఐ లవ్ యూ అన్న మూడు మాటలు తప్ప ఇంకేదీ లేకపోవటం దురదృష్టకరం.

పై సంభాషణలో ముందు హీరో స్థితి వ్రాసి, తరువాత ఆ డైలాగ్ వ్రాయటం వల్ల ఒక విధమైన విశిష్టత చేకూరింది.

తను, బడు ప్రయోగం

చాలామంది రచయితలు "బడు" ప్రయోగం గురించి రకరకాల వాఖ్యానాలు చేశారు. కానీ నా రచనలో ఎక్కువగా ఈ 'బడు' అన్న ప్రయోగం కనబడుతూనే ఉంటుంది. వీలయినంత వరకూ దీన్ని ఉపయోగించకుండా ఉండటం మంచిది. అదే విధంగా "తను అన్న ప్రయోగం ఎక్కువగా రావటం మంచిది కాదు. ముఖ్యంగా నవలని ఉత్తమ పురుష (నేను) లో వ్రాసేటప్పుడు 'తను' అన్న ప్రయోగం సాధారణంగా రాదు. ఒక మనిషి (ప్రధాన పాత్రధారి) తనకి సంబంధించిన సంఘటనలని విశ్లేషించుకుంటున్నప్పుడే ఈ 'తను' అన్న ప్రయోగం ఎక్కువగా వస్తుంటుంది.

రొమాన్స్ - సెక్స్

'ఇద్దరూ నగ్నంగా ఉన్నారు. అతడి మీద ఆమె ఉంది. ఆమె వెన్నెముక మీద చంద్ర కిరణం లయబద్ధంగా కదులుతోంది.'

ప్రియురాలు పిలిచెలో వాక్యమిది.

సెక్స్ గురించి నేను వ్రాసిన అన్ని సందర్భాల్లోకెల్లా పరాకాష్టగా దీన్ని భావిస్తున్నాను.

సెక్స్‌కీ, శృంగారానికి తేడా చెప్పటం చాలా కష్టం, ఒక రచయిత్రి మాటల్లో చెప్పాలంటే - చదవగానే శరీరం ఆర్ద్రత చెందితే అది సెక్స్, మనస్సు ఆర్ద్రత చెందితే అది శృంగారం.

పాపులర్ రచనలో సెక్స్ ఎక్కువగా వ్రాస్తే దానికి ఎక్కువగా మార్కెట్ ఉన్న మాట కొంత వరకూ నిజమే కానీ, పాఠకులకి మంచి అభిప్రాయం ఉండదు. అదే భావాన్ని కొంచెం శృంగారపరంగా వ్రాస్తూ కూడా పాఠకుల్లో ఆ ఫీలింగ్ కలిగించవచ్చు. దీనికి కొంత నేర్పు అవసరం. పూర్తిగా బట్టలు విప్పేసినట్టు వ్రాస్తే అది పాఠకుల హృదయం మీదా, శరీరం మీద ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తే చూపిస్తూ ఉండవచ్చునేమో కానీ, పుస్తకం అమ్మకాల విషయానికి వచ్చేసరికి కేవలం ఒక కేటగిరి పాఠకుల్ని మాత్రమే అది ఆకట్టుకుంటుంది.

అలాంటి పుస్తకాలని ఇళ్ళల్లో ఉంచుకోడానికి పాఠకులు సాధారణంగా ఇష్టపడరు. లైబ్రరీలో తీసుకుని రహస్యంగా చదివి ఇచ్చేస్తూ ఉంటారు. కేవలం టెంపరరీ మార్కెట్ మాత్రమే ఉంటుంది. కొంచెం కష్టమైనా సరే సెక్స్ కన్నా శృంగారం వ్రాయటమే మంచిది.

శృంగారం వ్రాయాలంటే రచయితకి భావావేశమూ, కల్పనాశక్తి, విషయ పరిజ్ఞానమూ బాగా కావాలి. ప్రబంధాలతోనూ, కావ్యాలతోనూ పరిచయం ఉండడం కూడా మంచిదే ఇవేమీ లేని పక్షంలో కూడా అందమైన శృంగారం వ్రాయొచ్చు. ఎప్పుడయినా సరే భార్యాభర్తల మధ్య శృంగారం వ్రాయటమే మంచి పద్ధతి. పరాయి పురుషుడితోగాని, పరాయి స్త్రీతో గానీ విచ్చలవిడి శృంగారం వ్రాస్తే పాఠకులకి రచయిత మీద (ఇంతకుముందే చెప్పినట్లు) అభిప్రాయం తగ్గిపోతుంది.

మరేవిధంగానూ పాపులారిటీ సంపాదించుకోలేని రచయితలు మాత్రమే ఈ విధమైన పచ్చి శృంగారాన్ని వ్రాస్తారని గుర్తుంచుకోవాలి.

వీలయినంతవరకూ భార్యాభర్తల మధ్య శృంగారం వ్రాయటమే మంచి పద్ధతినిపైన చెప్పటం జరిగింది. ఇది వ్రాసేటప్పుడు కూడా పాఠకులకి తాము ఆచరించని (ఊహించని) శృంగార ప్రక్రియ ఏదయినా వ్రాస్తే బావుంటుంది. ఆ నవల చదవగానే ఇలా చేస్తే బావుంటుందికదా అన్న భావం పాఠకుల్లో కలగాలి.

బ్రా హుక్కు తీశాడు. పెట్టీకోట్ ముడి విప్పాడు - లాంటి చౌకబారు ప్రయోగాలు ఈ మధ్య చాలా రచనల్లో వస్తున్నాయి. కొంతమంది రచయితలు ఇదే విధంగా వ్రాస్తూ కొంత మార్కెట్ సంపాదించుకున్నారు కూడా. అయితే ఈ మార్కెట్ అలా వ్రాయకుండా కూడా సంపాదించుకోవచ్చు. ఇంకే విధంగా వ్రాయటం చేతకాని రచయితలు మాత్రమే ఈ విధంగా శృంగారం వ్రాస్తారు అని మా నమ్మకం.

వచ్చే సంచికలో.. అనాసక్తమైన సంఘటనలు